

# అద్వైతం – శారద (బ్రిస్బేన్)

## (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

## జూన్ 1993

"సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంగ్లీష్ ఎండ్ ఫారిన్ లాంగ్వేజెస్" బోర్డు చూస్తూ అక్కడే వున్న చెట్టు కింద కూర్చుంది భాను.

దేవుడా, ఏమిటీ ఎండ! ఈ అశోక్ ఏమిటి, పది దాటి పోయింది, ఇంకా జాడలేదు. అనుకుంటూ కూర్చుంది. వచ్చే ప్రతీ ఆటో వైపూ చూస్తూ, తన వైపే నడిచొస్తున్న అశోక్‌ని గమనించనేలేదు.

"హాలో మేడం ఇంజినీర్!"

ఉలిక్కిపడి వెనక్కి చూసింది.

"హాయ్ అశోక్! ఇక్కణ్ణించి ఎలా వొచ్చావు? నేనింకా ఆటోలో వస్తావని ఇటూవైపు చూస్తూ నిలబడ్డాను."

"అదా! బైక్ మీదొచ్చాను."

"బైకా? వార్నీ! ఎక్కడిది? నువ్వు కొనుక్కున్నావా?"

"ఇంకా కొనలేదు, కానీ కొనే ముందు ప్రాక్టీసు చేద్దామని ఇవాళ శివా గాడి బైక్ తెచ్చాను. పద లోపలికెళ్దాం. ఇక్కడ పీహెచ్‌డీ అప్లికేషన్ ఇచ్చేసి వొద్దాం."

"ఇక్కడ పీహెచ్‌డీ చెయ్యొచ్చా? ఎందులో? ఇంగ్లీషులోనా?"

"అవును." అప్లికేషన్ ఫారం ఒక్కసారి సరిచూసుకుంటూ అన్నాడు అశోక్.

అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులోకెళ్ళి తన ఫారం ఇచ్చాడు అశోక్. వాళ్ళు ఫారంతో పాటు అతను జత చేసిన డాక్యుమెంట్లు చెక్ చేసారు.

"ఎమ్మే ఆఖరి సెమిస్టర్ మార్క్స్ షీటు లేదే?" అడిగాడు క్లర్కు.

"ఇంకా రిజల్ట్స్ రాలేదండీ. రెండూ వారాల్లో వస్తాయి. రాగానే ఆ మార్క్స్ షీటూ పెడతాను. ఈ లోపల అప్లికేషను లాస్ట్ డేటు అయిపోతుందని అవి లేకుండానే పెట్టేస్తున్నాను," వివరించాడు అశోక్.

"అలాగా! సాధారణంగా ఇంగ్లీషు పీహెచ్‌డీకి సర్వీసులో వున్న లెక్చరర్లు అప్లై చేస్తారు. ఈ అప్లికేషను కూడా అలాటిదే అనుకున్నాను." అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు ఇస్తూ అన్నాడు క్లర్కు.

"థాంక్స్. ఇంటర్వ్యూ వుంటుందానండీ?"

"ఏమోనండి. కిందటి యేడాది ఇంటర్వ్యూలు చేసారు. మరి ఈ యేడాది చేస్తారో లేక మార్కుల లిస్టుతో ఇచ్చేస్తారో తెలియదు. మీరు మాత్రం మీ మార్క్స్ లిస్టు రాగానే వొచ్చి కాపీ ఇచ్చి వెళ్ళండి. ఆల్ ది బెస్ట్."

అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు తనతో తెచ్చుకున్న ఫైలులో పెట్టుకొని బయటికొచ్చాడు అశోక్.

"పద. ఎక్కడికైనా వెళ్ళి ముందు కొంచెం చల్లగా ఏదైనా తాగుదాం. తరవాత లంచి." హెల్మెట్ పెట్టుకుంటూ అన్నాడు అశోక్.

"అలాగే, ఎక్కడైనా చెరుకు రసం బండి కనిపిస్తే ఆగు. అసలు నేను బైక్ ఎక్కటం ఇదే మొదటిసారి తెల్సా! ఎక్కువగా బస్సు, ఆటో, అమ్మా నాన్నలతో కలిసి వెళ్తే కారు," బండి మీద సర్దుకొని కూర్చుంటూ అంది భాను.

"అవునా? మరి జాగ్రత్తగా పట్టుకొని కూర్చో. నిదానంగానే వెళ్తాలే."

ఎండకి ఉపశమనంగా చెరుకు రసం తెచ్చుకుని పక్కనే చెట్టు కింద కూర్చున్నారిద్దరూ.

"పరీక్షలెలా రాసావు అశోక్ ? రిజల్ట్స్ ఎప్పుడొస్తాయి?"

"బానే రాసాలే. పరీక్షలకంటే మాకు అసైన్‌మెంట్స్ కొంచెం కష్టం. ఎంత బాగా రాసినా, ప్రొఫెసర్లు ఇంకా ఏదో తక్కువైందంటారు. ఇంకా ఏదో పాయింటు పట్టుకోలేదంటారు. ఫస్టు క్లాసు రాకపోతే, మా యూనివర్సిటీలోనే పీహెచ్‌డి సీటివ్వరు!" విసుగ్గా అన్నాడు అశోక్.

నవ్వింది భాను.

"అబ్బ! నీకింకా చదివే ఓపికుందా అశోక్? నాకైతే కొంచెం కూడా ఓపిక లేదు. ఉద్యోగంలో చేరి, పొద్దున్నే వెళ్ళీ సాయంత్రం వచ్చేసి, అమ్మ వొండిపెడితే ఇంత తిని టీవీ చూసుకొని పడుకుంటూ, జీవితం అలా వెళ్ళిపోతే చాలు."

"చాల్లే! ఆరునెల్లకి బోరెత్తిపోతుంది. ఇప్పుడు పరీక్షల అలసటతో అలా అనిపిస్తుందంతే. రెండు నెలలు రెస్టు తీసుకుంటే, యూ విల్ బి బేక్ ఎట్ యువర్ డెస్క్!"

"ఏమో మరి. ఒక కెమికల్ ఫాక్టరీలో ట్రెయినీ ఇంజినీరుగా ఆఫరు వచ్చింది. చేరిపోదామనే అనుకుంటున్నా. జీడిమెట్ల దగ్గర. ఈ నెలాఖరుకి పరీక్షల రిజల్ట్స్ వస్తే, జూలై మొదటి వారంలో చేరిపోవచ్చు. ఈ శుక్రవారం లోపల చేరుతున్నట్టు చెప్పాలి."

"అమ్మో!జీడిమెట్ల వరకా? మీ విద్యానగర్ నుంచి చాలా దూరం. రోజూ వెళ్ళి రావడం కష్టమేమో కదా?"

"అవుననుకో! చూద్దాం. ఫాక్టరీ బస్సొకటి వుంది పబ్లిక్ గార్డెన్స్ బస్ స్టాప్ దగ్గర్నుంచి. అంత కష్టమేమీ కాకపోవచ్చు. ఇప్పుడైతే రిజల్ట్స్  కోసం ఎదురు చూడడం తప్ప ఇంకేం పని లేదు."

"నేనూ అంతే. పీహెచ్‌డీ తో పాటు కొన్ని జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకి కూడా అప్లై చేసాను. చిన్న కాలేజీ ఐనా సరే చేరిపోతాను. కనీసం నా ఖర్చులు వెళ్ళిపోతాయి కదా?"

"పీహెచ్‌డీ స్కాలర్షిప్పు రాదూ?"

"వొస్తుందిలే కానీ, లెక్చరర్ ఉద్యోగం తేలిగ్గానే వుండొచ్చు. పీహెచ్‌డీ పని ఒక రెండేళ్ళక్కానీ ముమ్మరం కాదు. నాకు మా సెంట్రల్ యూనివర్సిటీ కంటే ఈ సీఫెల్‌లోనే చేరాలని వుంది."

" ఎందుకు? దగ్గరనా?"

"అది ఒక కారణం. కానీ ఇక్కడ మిగతా యూరోపియన్ భాషా వేత్తలు కూడ కలవొచ్చు. సీటొస్తే బాగుండు."

"బియ్యే గోల్డ్ మెడలిస్టువి, నీకు సీటు కళ్ళకద్దుకొని ఇస్తారు." కొట్టిపడేసింది భాను.

"ఐ హోప్ సో! పద, ఎక్కడైనా లంచ్ తిందాం. పొద్దణ్ణించీ నేనేమీ తినలేదు. అసలు అమ్మ అన్నం తినకుండా బయటికి కదలనివ్వదు. కానీ ఇవాళ మా ఇంటికి మా మావయ్యా వాళ్ళ ఫేమిలీ అంతా వొచ్చారు. అందుకే నన్ను పట్టించుకోలేదు."

"మావయ్య తో పాటు మావయ్య కూతుర్లు వగైరా?"

"మరేంటనుకున్నావ్! అసలు మా మావయ్య కూతురెంత బాగుంటుందో తెలుసా? బావా, తొందరగా వొచ్చేయ్ అని చెప్పింది వొచ్చేటప్పుడు."

"మరి వెళ్ళకుండా ఇప్పుడు మన లంచ్ ప్రోగ్రాం పెట్టావే? పాపం ఎదురుచూస్తుందేమో ఇంట్లో!" అక్కసుగా అంది భాను.

"లాభం లేదు. ఇప్పుడు నేనెళ్ళేసరికి అది అన్నం తినేసి నిద్రకు పడి వుంటుంది. ”

"హయ్యో! అంతేనా మరదలి ప్రేమ? అయినా పట్ట పగలు నిద్రేంటి? అంత నిద్ర మొహమా?"

"అంటే మరి అయిదేళ్ళ వయసులో నువ్వు కూడా అంతే అయివుంటావు."

"అయిదేళ్ళా? నీ మరదలికి అయిదేళ్ళా?"

"అవును, అందుకే బావా అంటూ నా చంకనెక్కి కూర్చుంటుంది."

ఆమె మొహం నవ్వుతో వెలిగిపోయింది. అది చూసి అశోక్ చిరునవ్వు పెదవుల అంచునే బిగ్గ పట్టాడు.

"చాల్చాల్లే, పద, ఆకలేస్తోందన్నావ్. ఎక్కడైనా కూర్చుని మెక్కుదాం."

ఇద్దరూ నవ్వుకుంటూ బైకెక్కారు.

★★★★★★★★★★★★★★★★★

## 1993- ఆగస్టు

"హేయ్, అశోక్! నువ్వేంటి ఇక్కడ?" మొదటిసారి కట్టుకున్న చీరతో సతమతవుతూ అడిగింది భాను.

" ఆశా ఎంగేజిమెంట్‌కి నన్నూ ఆహ్వానించారు మరి. ఒక్కదానివే వొచ్చావా? మీ అమ్మా నాన్నా యేరీ?"

"అక్కడ ఆశా వాళ్ళ అమ్మా నాన్నలతో మాట్లాడుతున్నారు."

ఆశా నిశ్చితార్థం శరత్‌తో సింపుల్‌గా జరిగిపోయింది. ఆహ్వానితులు కూడా ఎక్కువమంది లేరు.

బఫే భోజనం తెచ్చుకొని కూర్చున్నారు అందరూ. సుమతినీ, అమూల్యనీ, పద్మనాభం ప్రభావతీలకు పరిచయం చేసింది భాను.

"ఆశ నిన్ను యెంగేజిమెంటుకి పిలవడమేంటి? మీ ఇద్దరూ అంత మంచి స్నేహితులని తెలియనే లేదు నాకు."

"ఆశ కాదు, పిలిచింది శరత్ . వాళ్ళుండేది మా కాలనీలోనే. శరత్ నాకు స్కూల్లో సీనియర్. పైగా మా అమ్మకి కాలేజీలోకూడా స్టూడెంట్."

"రియల్లీ! ఎంత కో-యిన్సిడెన్స్ కదా?"

"అది సరే కానీ, ఇవాళ నీకు చీర బాగుంది. ఇదే మొదటిసారా చీర కట్టుకోవడం?"

"అవును. మా అమ్మ బలవంతం మీద కట్టుకున్నా, కానీ, బాబోయ్! ఎంత టెన్షను గా వుందో!"

నవ్వుతూ వున్న అశోక్ పక్కనే వొచ్చి కూర్చున్నాడు పద్మనాభం.

"బై ద వే, కంగ్రాట్స్ అశోక్. ఎమ్మే ఐపోయిందట కదా? భాను చెప్పింది. సో వాట్ నెక్స్ట్?"

"సీఫెల్ లో పీహెచ్‌డీ మొదలు పెట్టాను అంకుల్. ఒక డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పార్ట్ టైం ఉద్యోగం కూడా చేస్తున్నాను."

"అయ్యేయెస్సో, బేంకు పరీక్షలకో ప్రిపేరవచ్చు కదా?"

"అవొచ్చు కానీ, అయ్యేయెస్సవీ వొచ్చేంత తెలివితేటలు నాకున్నాయని నేననుకోను. సెలెక్టయ్యే అవకాశం చాలా తక్కువ. పైగా, ఆ లైఫ్ స్టైల్ నాకు సరిపడదు కూడా. బాంకు ఉద్యోగం కంటే నాకు ఇంగ్లీషు సాహిత్యానికి దగ్గరగా వుండే ఉద్యోగం చేయాలని వుందంకుల్. అందుకే పీహెచ్‌డీ చేస్తున్నాను."

"కానీ, ప్రైవేటు కాలేజీలో లెక్చరరంటే ఎదుగూ బొదుగూ లేని జీవితం."

"అవును, కానీ నేనేమీ అక్కడే ఆగిపోదలుకోలేదు కదా? పీహెచ్‌డీ చేస్తాను. యూనివర్సిటీలో ఫేకల్టీ లో చేరడానికి ప్రయత్నిస్తాను. చూద్దాం, ఏమవుతుందో." పద్మనాభానికెందుకో అతని జవాబు నచ్చలేదు.

"ఇంకా డాన్సు చేస్తూనే వున్నావా అశోక్?" ఈసారి ప్రభావతి అడిగింది.

"చేస్తూనే వున్నా ఆంటీ. ప్రాక్టీసుకి కొంచెం టైం సరిపోవడంలేదు ఈ మధ్య."

"సాగర సంగమం సినిమా చూసావా? నచ్చిందా?"

"చూసానాంటీ, నచ్చింది."

"మా భానుకి జీడిమెట్లలో వున్న కెమికల్ ఇంజినీరింగ్ ఫాక్టరీలో ఉద్యోగం వచ్చింది. నెల రోజుల కిందే చేరింది."

"అవునా భానూ? కంగ్రాట్స్! కొత్త ఉద్యోగం బాగుందా?" ఏమీ తెలియనట్టు అన్నాడు.

భాను పెదవి కొరుక్కుంటూ నవ్వాపుకుంది.

"అశోక్, ఆ టేబిల్ దగ్గర్నుంచి సూసీ పిలుస్తోంది నిన్ను." భాను మాటలతో హమ్మయ్య అని సూసీకి హలో చెప్పడానికి వెళ్ళాడు అశోక్.

డిన్నర్ తినేసి ఐస్‌క్రీం తెచ్చుకోవడానికెళ్ళింది భాను. తనకో కప్పూ, అశోక్ కోసం ఇంకో కప్పూ తీసుకొని సూసీ కూర్చున్న టేబిల్ దగ్గరకెళ్ళి కూర్చుంది. ఆమె అశోక్ కోసం ఐస్‌క్రీం తెచ్చి ఇవ్వడం చూసి కళ్ళెగరేసింది సూసీ.

"ఆశా ఇక మనతో సినిమాలకొస్తుందో రాదోనే," అంది కోమలి దిగులుగా.

"అవునే, నేను మొన్న మనీ సినిమా చూస్తూ సరిగ్గా అదే అనుకున్నా."

"నువ్వు మనీ సినిమా చూసేసావా? అసలు నేను సెలవల్లో ఒక్క సినిమా కూడా చూడలేదు."

అందరూ వాళ్ళ కొత్త ఉద్యోగాల గురించీ, కొత్త రొటీన్ల గురించీ మాట్లాడుకుంటూ కూర్చొన్నారు. కోమలి పని చేసే సాఫ్ట్ వేర్ కంపెనీలోనే శివా చేస్తున్నాడని చెప్పాడు అశోక్.

"బహుశా మనందరం మళ్ళీ ఆశా పెళ్ళిలో కలుస్తామేమో," అన్నది భాను.

"పెళ్ళి డిసెంబరు నాలుగో తారీకునంట, ఇంకా చాలా రోజులుంది!" సూసీ తేల్చి పారేసింది.

ప్రభావతీ, సుమతీ, పద్మనాభమూ కాసేపు కాలక్షేపం కబుర్లు చెప్పుకున్నారు. వాళ్ళ కులమేమిటో అడగాలనని మహా ఇదిగా వున్నా, ఏమీ అడగలేదు ప్రభావతి. ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకొని విడిపోయారందరూ.

★★★★★★★★★★★★★★★★★★★★

## 1993 అక్టోబర్

"హలో భానూ, బాగున్నావా?"

"హాయ్ అశోక్, వాటే సర్ప్రైజ్! ఎక్కణ్ణుంచి ఫోన్ చేస్తున్నావ్?"

"మా ఇంటి నుంచే. నిన్ననే మా ఇంటికి ఫోనొచ్చింది. నెంబరు రాసుకో."

అతను నెంబరు చెప్తూంటే రాసుకుంది భాను.

" భానూ, ఈ శనివారం మనం కలవాలి. మినర్వా దగ్గరికి మూడింటికి రా. కొంచెం పని వుంది. వీలవుతుందా? "

"సరే వొస్తాలే కానీ, ఏం పని?"

"ఫోన్లో చెప్పే విషయం కాదు, తరవాత చెప్తా. నువ్వు మాత్రం మూడింటికొచ్చేయి. బై."

ఆ శనివారం మినర్వా దగ్గర ఆటో దిగిన భాను, అక్కడ అశోక్ ఒక్కడే కాకుండా, పక్కన సూసీని చూసి ఆశ్చర్యపోయింది. సూసీనెందుకు రమ్మన్నాడు? ఆమెకెందుకో చిరాకెత్తింది. తిరిగి వెనక్కెళ్ళిపోదామని ఆటో కోసం చూస్తూండగానే, ఇంకో ఆటోలోంచి కోమలీ, శివా దిగడం చూసి ఇంకా ఆశ్చర్యపోయింది.

"కోమలీ, నువ్వేంటి ఇక్కడ?" భానుకి మీ అర్థం కావడంలేదు.

"చెప్తా, నేనూ నీలాగే ఆశ్చర్యపోయా. శివా అంతా ఎక్స్‌ప్లైన్ చేసాడు. ముందు లోపలికి పద, అంతా చెప్తాను."

కోమలి హడావిడిగా భాను చేయి పట్టుకోని లోపలికి నడిచింది. లోపల అశోక్, సూసీ ఒక టేబిల్ దగ్గర కూర్చోని ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. భాను గుండెలు దడ దడలాడాయి. ఏం జరుగుతోంది?

"అదిగో శివా! రా రా!" అశోక్ తల పైకెత్తి వీళ్ళని పిలిచాడు.

"ఏమిటి అశోక్? అందరూ ఇక్కడ చేరారు? సంగతేమిటి?" భాను ఆత్రంగా అడిగింది.

"ఆగు, మంచి విశేషమే. స్వీట్ ఆర్డర్ చేసాను. తింటూ కబుర్లు చెప్పుకుందాం. నువ్వు చెప్తావా సూసీ, నేను చెప్పనా?"

భాను కళ్ళల్లో నీళ్ళు దూకడానికి సిద్ధంగా వున్నాయి. ఏ మాటలూ వినిపించకుండా చెవిలో హోరు. వెయిటర్ బాసుందీ కప్పులు తెచ్చి సర్దుతున్నాడు. సూసీ గొంతు సవరించుకుంది.

"సరే, నేనే చెప్తాను. నేనూ శివా పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాము."

భానుకి  ఒక్క క్షణం తానేదో కలగంటున్నట్టనిపించింది. తాను విన్నది నిజమేనా? ఊహించుకుంటూందా?

"వాట్ సూసీ? నీకు పెళ్ళా? శివా తోనా? ఎప్పుడు జరిగిందితంతా? అసలు తన్నాలి నిన్ను," నవ్వుతూ అంటోంది కానీ, తన గొంతు తనకే వినిపిస్తున్నట్టు లేదు.

"అవునే, అశోక్‌తో పాటు శివా డాన్స్ క్లాస్‌కి వొచ్చేవాడు. అలా పరిచయం అయాడు. ఆరు నెల్ల కిందే పెళ్ళి గురించి ఆలోచించడం మొదలుపెట్టాం."

"కానీ, మా ఇద్దరి ఇళ్ళల్లోనూ ఒప్పుకోవటం లేదు. ఇప్పుడేం చేయాలో అర్థం కాక ఈ మీటింగ్ పెట్టాం!" శివా అందుకోని చెప్పి, అందరి మొహాల వైపూ చూసాడు. ఎవరూ ఏం మాట్లాడలేదు. కొంచెం సేపు ఆలోచించి అశోక్ అన్నాడు.

"అయితే, మీరిద్దరూ గట్టిగా నిర్ణయించుకున్నట్టేగా? వెనక్కి తగ్గే ఆలోచనేం లేదుగా?"

"నీ బొంద! తగ్గే ఆలోచనే వుంటే మిమ్మల్నందర్నీ పిలిచి మీటింగు పెట్టి చెప్తామా?" శివ చిరాగ్గా అన్నాడు.

"అవుననుకో, జస్ట్ కన్‌ఫర్మింగ్, అంతే. మీరిద్దరూ గట్టిగా నిలబడే ధైర్యం వుంటే, ముందుకెళ్ళి పెళ్ళి చేసుకోవడమే."

"ఎప్పుడు చేసుకుంటారు పెళ్ళి?" భాను అడిగింది.

"కనీసం రెండు నెలల టైం కావాలి. గుళ్ళో పెళ్ళి కైనా  చాలా ఏర్పాట్లు చేయాలి కదా?" కోమలి అంది.

భాను బేగులోంచి నోట్‌బుక్ తీసి లిస్టు రాస్తూ పైకి చదవసాగింది.

"వెన్యూ, బట్టలు, పూలదండలు, ఫోటోగ్రాఫరు, అసలు ముందు వీళ్ళిద్దరూ ఇల్లు వెతుక్కోవాలి. అన్నట్టు పెళ్ళయింతరవాత లంచి బయట హోటల్‌కే వెళ్ళిపోతాం కదా? లేకపోతే మళ్ళీ భోజనం కోసం వంట మనిషిని కూడా చూడాలి."

అందరూ నవ్వారు.

"వెన్యూ అవసరంలేదు. సివిల్ మేరేజ్ చేసుకుందాం సూసీ, రిజిస్ట్రార్ ఆఫీసులో రేపే అప్లికేషను పడేస్తే, రెణ్ణెల్ల తరవాత డేట్ ఇస్తారు."

"అది మంచి అయిడియా శివా, కానీ మరి రెండు నెలలు ఇంట్లో వాళ్ళ ప్రెషర్ తట్టుకోని వుండగలవా? అదే గుళ్ళోనో, ఆర్య సమాజ్‌లోనో అయితే రెండురోజుల్లో పెళ్ళి చేసేసుకోవచ్చు, ఆలోచించుకోండి మరి," అశోక్ మాటలకి మళ్ళీ ఆలోచనలో పడ్డారందరూ.

వాళ్ళు ఆలోచనలో వుండగానే ఒగరుస్తూ వొచ్చాడు వెంకట్, "వాట్ డిడ్ ఐ మిస్? ముఖ్యమైన విషయమని చెప్పి రమ్మన్నారు. ఇవాళ శనివారమైనా ఆఫీసుకు వెళ్ళాల్సొచ్చింది."

మళ్ళీ సంగతంతా అతనితో చెప్పింది భాను.

"ఓకే, ముందు అర్జెంటుగా రెండు మూడు వారాల్లో గుళ్ళో పెళ్ళాడెయ్యండి. పెళ్ళి రెండు నెలల్లో రిజిస్టర్ కూడా చేయించుకోండి," వెంకట్ సలహా ఇచ్చాడు.

అది అందరికీ నచ్చింది.

"ఆగాగు! సూసీ, నీకు గుళ్ళో పెళ్ళి ఓకేనా?  లేదంటే చర్చిలోనైనా సరే. నాకేమీ సమస్యా లేదు," శివ అడిగాడు సూసీని.

"శనివారం గుళ్ళో, ఆదివారం చర్చిలో జరిపిద్దాం! రెండు రోజులూ ఎంజాయ్ చేయొచ్చు!"ఉత్సాహంగా అంది భాను.

"అవును! శనివారం గుళ్ళో, ఆదివారం చర్చిలో పెళ్ళి ఐడియా బాగుంది. నేను ఎప్పుడూ వెళ్ళే చర్చిలో కాకుండా సికిందరాబాద్ వైపు వుండే చర్చిల్లో అడిగి చూస్తాను," సూసీ  ఒప్పుకుంది.

"ముందు నేను మా అమ్మ, నాన్న గార్లనడిగి వచ్చే నాలుగైదు రోజుల్లో మంచి రోజేది వుందో కనుక్కుంటాను. ఆ తరవాత మీరు ఏ గుళ్ళో ఆ రోజు పెళ్ళి చేయడానికి వీలవుతుందో కనుక్కోండి," కోమలి అంది.

"సరే, నేనూ అశోకూ ఫోటోగ్రాఫరూ, దండలూ, గుళ్ళో పూజారీ ఏర్పాట్లు చేస్తాం.

కోమలీ, భానూ బట్టల షాపింగ్ చేస్తారు. శివా, సూసీ ఇంటికోసం వెతకడం మొదలు పెడతారు, సూసీ, నువ్వు చర్చి ఫాదర్‌తో కూడా మాట్లాడాలి." వెంకట్ పనులు పంచేసాడు. భాను నోట్ బుక్కులో పేజీల మీద ఎవరి పన్లు వారికి రాసి ఇచ్చేసింది.

"డబ్బు ఎవరెంత ఖర్చు పెడుతున్నారో లెక్క రాసి వుంచండి. పెళ్ళి ఖర్చంతా నేనూ, సూసీనే పెట్టుకుంటాం. మీరెవరూ డబ్బు పెట్టొద్దు. నేను రెండేళ్ళ నించి ఉద్యోగం చేస్తున్నా కాబట్టి బాగానే దాచుకున్నా," శివ అన్నాడు.

అందరూ ఇంకో రవుండు టీలు తాగి ఉత్సాహంగా బయల్దేరారు.

"సూసీ, ఆశాకి రాత్రిక్ ఫోన్ చేసి చెప్పు. దానికొక్కదానికీ చెప్పకపోతే చాలా బాధ పడుతుంది," ఆటో ఎక్కబోతూ అంది భాను.

"అమ్మో! మా ఇంట్లో ఫోన్ మాట్లాడడం కుదరదే! నువ్వే చేయరాదూ?"

"సరే, నేను రాత్రికి తనతో మాట్లాడతాలే. ఎవ్విరీ థింగ్ విల్ బి ఫైన్." సూసీని హత్తుకోని వదిలేసింది భాను. అంతా విడిపోయారు.

★★★★★★★★★★★★★★

ఆటోలో ఇంటికెళ్తున్న భానుకి మనసుకి రెక్కలొచ్చేసినట్టూ, గాల్లో తేలిపోతూవున్నట్టు అనిపిస్తోంది. సూసీ శివాని పెళ్ళిచేసుకోబోతోంది. దానికి తనకింత ఆనందంగా ఎందుకుందో మాత్రం అర్థం కావడంలేదు. మనసు మీదినుంచి ఏదో బరువైన సంకెళ్ళు తీసేసినట్టూ, అసలు చుట్టూ వున్న మనుషులంతా చాలా మంచి వాళ్ళైనట్టూ ఏదో వెర్రెత్తినట్టుగా వుంది.

ఇంటికెళ్ళి ఏదో అమ్మ పెట్టిన రెండు ముద్దలు తిన్నదే కానీ, అమ్మా నాన్నా ఏం మాట్లాడుతున్నారో, ఏం అడుగుతున్నారో ఏమీ వినబడటం లేదూ, అర్థం కావడంలేదూ. మర్నాడు అమ్మా నాన్నా కూరగాయలకి వెళ్ళి, తను ఇంట్లో ఒక్కతీ వున్న టైం చూసుకొని ఆశాకి ఫోన్ చేసింది భాను. విషయం వింటూనే కెవ్వుమంది ఆశా.

"అమ్మ! ఎంత పని చేసిందే సూసీ! మనతోనే వుంటూ మన కళ్ళల్లోనే కారం కొట్టింది."

"అవును, నువ్వే ఆ మాట చెప్పాలి. అసలు మీరంతా ఒకటేనే, ఎంతలేసి రహస్యాలూ కడుపులో దాచుకుని పైకి ఏమీ తెలియనట్టు వుంటారు."

"సరే, ఇప్పుడు మనకీ వాదన ఎందుక్కానీ, షాపింగ్‌లకీ వాటికీ నన్నొదిలేసిపోతే నిన్నూ కోమలినీ కలిపి చావగొడతా!"

"లేదు లేవే! ముగ్గురం కలిసే వెళదాం. రేపో ఎల్లుండో కోమలి పెళ్ళి డేట్లు చెప్తుంది. దాన్ని బట్టి ప్లానింగన్నమాట. ఏ సంగతీ మనకి శివా, సూసీ చెప్తారు. కోమలీ, శివా కొలీగ్స్ కాబట్టి, అందరికీ సమాచారం అందుతూనే వుంటుంది."

"అబ్బ, ఎంత ఎక్సైటింగ్‌గా వుందే! అందులోనూ, అమ్మా నాన్నలకి ఇష్టం లేకుండా మనమే నిలబడి చేస్తున్న పెళ్ళి."

ఇంకొంచెం సేపు మాట్లాడుకొని ఫోన్ పెట్టేసారిద్దరూ.

★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS